క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం



తుని గణపతినగర్‌లో వాకర్స్‌కు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

తుని: స్థానిక గణపతినగర్‌లో సిటీ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 60 మందికి షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించినట్టు వాకర్స్ క్లబ్ తుని శాఖ అధ్యక్షుడు ఆర్ఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నడకతో ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. వాకర్స్‌కు ప్రతి నెలా ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. వాకర్స్ క్లబ్ కార్యదర్శి సీహెచ్ సోమేశ్వరరావు, ఉపాధ్యక్షుడు లోకారెడ్డి అప్పారావు, కోశాధికారి బి.సత్యనారాయణ, సహాయ కార్యదర్శి రాజు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కుసుమంచి సుబ్బరాయులు, కె.భీమరాజు, చోడిశెట్టి త్రిమూర్తి స్వామి పాల్గొన్నారు.

'నాడు-నేడు' పనులను వేగవంతం చేయాలి

శంఖవరం: ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న రెండో విడత నాడు-నేడు పనులను వేగవంతం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ తేజ సూచించారు. మండలంలోని మండపం జెడ్పీ హైస్కూల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు-నేడు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఆయా పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు. నిబంధనలు పాటిస్తూ నిర్ణీత సమయంలో పనులను పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు సమాజంపై అవగాహన అవసరం

ఏలేశ్వరం: విద్యార్థులకు సమాజంపై అవగాహన అవసరమని స్థానిక ఎస్సై జి.సతీష్ అన్నారు. మండలంలోని యర్రవరంలో విజ్ఞానజ్యోతి జూనియర్ కళాశాలలో శుక్రవారం స్వామి వివేకానందా సేవాసమితి ట్రస్టు ఆధ్వర్యంలో సమాజం-మనబాధ్యత, భవిష్యత్ నిర్మాణం అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సమాజం పట్ల అవగాహనతో పాటు బాధ్యత కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించాలని సూచించారు. ప్రత్తిపాడు మినర్వా విద్యాసంస్థల అధినేత డీవీఎస్ రాజు, వివేకానందా ట్రస్టు అధ్యక్షుడు మైరాల నాగేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరమణ, వెలుగూరి హరేరామ్, గోళ్ల నాగేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కిర్లంపూడి ఎస్సైగా ఉమామహేశ్వరరావు



కిర్లంపూడి: కిర్లంపూడి ఎస్సైగా పిక్కి ఉమామహేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకూ ఇక్కడ ఎస్సైగా పని చేసిన ఎస్సై టి.రఘునాథరావు అల్లూరి సీతారామరాజు జిల్లా జెడ్డంగి పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. రాజమహేంద్రవరం స్పెషల్ బ్రాంచ్‌లో పని చేసిన ఉమామహేశ్వరరావు బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టంగా లా అండ్ ఆర్డర్‌ను అమలు చేస్తామని తెలిపారు.

వర్షంతో ఉపశమనం

తొండంగి: మండల వ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత, ఉక్కబోత అధికంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై మెట్ట, పల్లపు ప్రాంతాల్లో ఓ మోస్తారు వర్షం కురిసింది. వాతావరణం చల్లబడటంతో ప్రజలు సేద తీరారు.

పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాన్ని వినియోగంలోకి తేవాలి

జగ్గంపేట: గోదావరి జలాలను ఏలేరుకు తరలించేందుకు ఏర్పాటు చేసిన పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాన్ని తక్షణమే వినియోగంలోకి తేవాలని రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ కోరారు. రామవరంలోని పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. త్వరలో ఈ ఎత్తిపోతల పథకం పరిశీలనకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు వస్తారని తెలిపారు.

టీడీపీ శ్రేణుల నిరసన

జగ్గంపేట: తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడి కాన్వాయిపై తంబళ్లపల్లి నియోజకవర్గం పుంగనూరులో జరిగిన దాడిని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ ఖండించారు. ఈ మేరకు మండలంలోని జె.కొత్తూరులో టీడీపీ నేతలు, కార్యకర్తలతో కలిసి రాస్తారోకో నిర్వహించి కాగడాలతో నిరసన ప్రదర్శన చేశారు. ఇరిగేషన్ ప్రాజెక్టు పరిశీలనకు వెళుతున్న చంద్రబాబుపై దాడిచేయడం దారుణమని అన్నారు.

సచివాలయాలు.. గ్రామ సేవాలయాలు

- సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకే పాలన
- రెండున్నరేళ్లలో 82,425 అర్జీలు
- 97 శాతం పరిష్కారం
- ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజలు



హంసవరంలో గ్రామ సచివాలయం

తుని రూరల్: మహాత్మ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం తీసుకురావలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారు. గ్రామీణులు మండల కేంద్రంలో ఉండే ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరగకుండా ఉన్న ఊరులోనే ప్రభుత్వ సేవలను అందించేందుకు 2020 జనవరి 26న గ్రామ సచివాలయాల్లో వివిధ సేవలకు శ్రీకారం చుట్టారు. ఒక్కొక్క సచివాలయంలో పంచాయతీ రాజ్, రెవెన్యూ, భూ సర్వే, ఇంజినీరింగ్, విద్యుత్, వ్యవసాయం, ఉద్యాన, సెరీకల్చర్, వైద్యం, తదితర శాఖలకు చెందిన సిబ్బందిని నియమించారు. ప్రస్తుతం సచివాలయాల్లో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన ఐదు వందలకుపైగా సేవలు అందిస్తున్నారు. ఇంతటి బృహత్తర సేవలు అందిస్తున్న సచివాలయాలకు సొంత భవనాలను సైతం సమకూర్చుతున్నారు. ప్రజల తలుపుతట్టి సేవలు అందించేందుకు సచివాలయ సిబ్బందితో పాటు వలంటీర్లను నియమించారు. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఆయా గృహస్తులకు అవసరమైన సర్టిఫికెట్లకు దరఖాస్తులు స్వీకరించడం, గడువులోగా వివిధ సర్టిఫికెట్లను మంజూరు చేయించి అర్హులకు అందిస్తున్నారు.

మండలంలో 27 సచివాలయాలు

తుని మండలంలో 24 పంచాయతీలు ఉండగా 27 సచివాలయాలను ఏర్పాటు చేశారు. ప్రతి రెండు వేల జనాభాకు ఒక సచివాలయం ఏర్పాటు చేశారు. ఎస్.అన్నవరంలో నాలుగు, తేటగుంట, కేఓ మల్లవరం, డి.పోలవరం పంచాయతీల్లో రెండేసి, మిగిలిన పంచాయతీల్లో ఒక్కొక్క సచివాలయాన్ని నెలకొల్పారు. ఈ సచివాలయాల ద్వారా అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, రైతు భరోసా, మత్స్యకార భరోసా వంటి సంక్షేమ పథకాలతో పాటు వివిధ సేవలను అందిస్తున్నారు. విద్యుత్, తదితర బిల్లుల చెల్లింపునకు అవకాశాలు కల్పించారు.

విభాగాల వారీగా అర్జీల సంఖ్య

విభాగం	అర్జీల సంఖ్య
రెవెన్యూ	38,415
బిల్లు చెల్లింపులు	29,301
ఈపీఈపీడీసీఎల్	4638
సివిల్ సప్లై	2644
పంచాయతీ రాజ్	2130
ఆధార్	1112
హెల్త్ అండ్ మెడికల్	1468
ఇతర విభాగాలు	2717
మొత్తం	82,425

సొంతూరులోనే సేవలు

గత పాలకులు ఆరు నెలలకు ఒకసారి ప్రజల వద్దకు పాలన కార్యక్రమాన్ని తూతూ మంత్రంగా నిర్వహించి గొప్పలు చెప్పుకున్నారు. నిజమైన ప్రజల వద్దకు పాలన ఇలా ఉంటుందని సచివాలయాల ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరూపించారు. సచివాలయ వ్యవస్థతో గ్రామీణులకు ఉన్న ఊరులోనే సకాలంలో సేవలు అందిస్తున్నారు.

79,964 అర్జీల పరిష్కారం

2020 జనవరి 26 నుంచి ఈ నెల 28 వరకు 27 సచివాలయాలకు 82,425 అర్జీలు వచ్చాయి. ఇందులో 79,964 అర్జీలను వివిధ శాఖల అధికారులు పరిష్కరించారు. వివిధ కారణాలతో 1631 అర్జీలు తిరస్కరించారు. మరో 830 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయి. సచివాలయాలకు వచ్చిన అర్జీలలో అత్యధిక శాతం రెవెన్యూ, బిల్లు చెల్లింపులవే.

రెండు రోజుల్లో రేషన్ కార్డు



పెళ్లికి ముందు తల్లిదండ్రుల ఉమ్మడి రేషన్‌కార్డులో నా పేరు ఉండేది. 2020లో పెళ్లయిన తర్వాత గ్రామ సచివాలయంలో రేషన్ కార్డుకు దరఖాస్తు చేశాం. 12 గంటల్లో రేషన్ కార్డు మంజూరైనట్టు ఎస్ఎంఎస్ వచ్చింది. రెండు రోజుల్లోనే కొత్త రేషన్ కార్డు ఇచ్చారు. 48 గంటల్లో రేషన్ కార్డు చేతికి అందడం ఎంతో సంతోషాన్ని ఇచ్చింది.

– తోలం అంజలి, కొత్త సూరవరం

గ్రామంలోనే ధ్రువపత్రాలు



గతంలో రెవెన్యూ శాఖ నుంచి ఏ ధ్రువ పత్రం తీసుకోవాలన్న తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఏ సర్టిఫికెట్ కావాలన్నా గ్రామంలోనే ఇస్తున్నారు. మా పిల్లల చదువుల నిమిత్తం కుల, ఆదాయ ధ్రువ పత్రాలకు సచివాలయంలో దరఖాస్తు చేశాను. వారం రోజుల్లో వలంటీర్ ఇంటికి తీసుకువచ్చి ఇచ్చారు.

– కరపా ఆదినారాయణ, చామవరం

సేవలన్నీ అందుతున్నాయ్



ఒక కుటుంబానికి కావలసిన అన్నిరకాల ప్రభుత్వ సేవలు గ్రామ సచివాలయాల్లో అందుతున్నాయి. విద్యార్థులకు నిర్దిష్ట కాలంలో సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. నేను కుల, ఆదాయ సర్టిఫికెట్లతో పాటు ఆధార్ అప్‌డేట్ సచివాలయంలోనే చేయించుకున్నాను. సచివాలయ వ్యవస్థతో మెరుగైన సేవలు అందుబాటులోకి వచ్చాయి.

– సుర్ల శ్రీనివాస్, కేఓ మల్లవరం

914 అర్జీలు స్వీకరించాం



గ్రామాల్లో శనివారం నుంచి నెల రోజుల పాటు నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమంలో 11 రకాల సచివాలయ సేవలను ఉచితంగా అందిస్తాం. ఇప్పటికే ఇంటింటా సర్వేలో 914 అర్జీలు స్వీకరించాం. గ్రామ సభ జరిగే ముందు రోజు వరకు సర్వే కొనసాగుతుంది. జగనన్న సురక్ష సేవలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలి.

– పి.రవికుమార్, ఎంపీడీఓ, తుని

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- కత్తిపూడిలో గడపగడపకూ మన ప్రభుత్వం



కత్తిపూడిలో మహిళలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

శంఖవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని కత్తిపూడిలో శక్రవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే గడపగడపకు వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత నాలుగేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల హామీల అమలే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. కరోనా కష్ట కాలంలోనూ రైతు భరోసా, అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ జలకళ వంటి సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. రానున్న కాలంలో ఈ పథకాలన్నీ అమలు కావాలంటే మరోసారి జగన్‌ను సీఎంగా గెలిపించాలని కోరారు. ఎంపీపీ పర్వత రాజబాబు, సర్పంచ్ కొల్లు సత్తిబాబు, ఉప సర్పంచ్ గౌతు నాగు, కోఆప్షన్ సభ్యుడు గాబు కృష్ణ, ఎంపీటీసీలు చల్లా సత్యప్రసాద్, జీలకర్ర విష్ణు, చోప్పా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ అదే తీరు

- తూతూమంత్రంగా కౌన్సిల్ సమావేశం
- 12 మంది సభ్యుల గైర్హాజరు



సమావేశంలో అజెండాను చదివి వినిపిస్తున్న దృశ్యం

ఏలేశ్వరం: స్థానిక నగర పంచాయతీ హాలులో శుక్రవారం చైర్‌పర్సన్ అలమండ సత్యవతి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఎప్పటిలాగే అరకొర సభ్యులతో తూతూమంత్రంగా సమావేశం నిర్వహించారు. నగర పంచాయతీలో 20 మంది సభ్యులు ఉండగా అధికార పక్షానికి 16 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో నలుగురు సభ్యులు పార్టీ విడిచిపోగా ప్రస్తుతం 12 మంది సభ్యులు ఉన్నారు. కాగా శుక్రవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశానికి కేవలం అధికార పక్షానికి చెందిన ఏడుగురు సభ్యులే హాజరయ్యారు. కోరం సరిపోని పరిస్థితి ఏర్పడగా ఓ టీడీపీ సభ్యుడు రావడంతో సమావేశం గట్టెక్కింది. సమావేశంలో పలు అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. 5వ ఆర్థిక సంఘం నిధులతో డ్రైన్లు, సీసీ రోడ్లు నిర్మించాలని నిర్ణయించారు. తొలుత సమావేశంలో పలు అభివృద్ధి పనులతో కూడిన అజెండాను చదివి వినిపించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కొండలరావు, మేనేజర్ కె.శ్రీనివాసరావు, వైస్ చైర్‌పర్సన్లు శిడగం త్రివేణి, మసిరపు బుజ్జి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే ప్రభుత్వ పాలన

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- కాట్రావులపల్లిలో నూతన సచివాలయ భవనం ప్రారంభం



కాట్రావులపల్లిలో సచివాలయ భవనం శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

జగ్గంపేట: గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో ప్రజల ముంగిటకే ప్రభుత్వ పాలన వచ్చిందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని కాట్రావులపల్లిలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకే ద్వారా ప్రజలు, రైతులకు మెరుగైన సేవలు అందుతున్నాయన్నారు. ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం కాట్రావులపల్లిలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రోడ్లు, డ్రైన్లు, వీధిదీపాలు తదితర సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ అత్తులూరి నాగబాబు, రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, సచివాలయాల మండల కన్వీనర్ బండారు రాజా, జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, గ్రామ సర్పంచ్ పిట్టా సుగణరావు, వి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం



వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. ఆలయ పండితులు ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు యనమండ్ర శర్మ, ఉపాధ్యాయుల రమేష్, వనదుర్గ ఆలయ పరిచారకులు చిట్టిం వాసు, చెల్లపళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు.

అమ్మవార్లకు లక్ష కుంకుమార్చన

సత్యదేవుని ప్రధానాలయంలో అనంతలక్ష్మీసత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలోనూ, కొండ దిగువన కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు ప్రయాగ రాంబాబు ఆధ్వర్యంలో రుత్విక్కులు లక్ష కుంకుమార్చన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



రౌతులపూడిలో లబ్ధిదారులకు పోషకాహార కిట్లును అందజేస్తున్న జెడ్పీటీసీ చినదివాణం

రౌతులపూడి: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందించే పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం అన్నారు. రౌతులపూడిలో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణపోషణ పథకంలో భాగంగా శంఖవరం ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి ఆధ్వర్యంలో శుక్రవారం టేక్ హోమ్ రేషన్ పంపిణీ చేశారు. జెడ్పీటీసీ ముఖ్య అతిథిగా హాజరై గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషకాహారం కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గర్భిణులు, బాలింతల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జిగిరెడ్డి రమణమ్మ, మండల వ్యవసాయ సలహాకమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు బీజా రాజు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ

ఏలేశ్వరం: పట్టణంలో గర్భిణులు, బాలింతలకు శుక్రవారం పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. స్థానిక అంబేడ్కర్ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా టేక్ హోమ్ రేషన్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ ఎ.సత్యవతి పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, తొండారపు రాంబాబు, దోశ కిషోర్, మసిరపు నాగేశ్వరరావు పాల్గొన్నారు. తూర్పులక్ష్మీపురంలో గర్భిణులు, బాలింతలకు ఎంపీటీసీ సభ్యుడు యిజనగిరి శివప్రసాద్ పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు.

గండేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గర్భిణులు, బాలింతలకు ఎంపీపీ చలగళ్ల దొరబాబు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు.

ప్రత్తిపాడురూరల్: మండలంలో గజ్జనపూడిలో గర్భిణులు, బాలింతలకు గ్రామ సర్పంచ్ గొనగాల అప్పలరాజు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు.

దేవీచౌక్ ఆలయానికి భక్తుల తాకిడి



ప్రత్యేక అలంకరణలో దేవీచౌక్ కనకదుర్గమ్మ

గోకవరం: గ్రామంలో ప్రసిద్ధి గాంచిన దేవీచౌక్ ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. అధిక శ్రావణమాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో అమ్మవారికి అర్చకులు వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ విశేష అలంకరణ చేశారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయంలో సామూహిక వరలక్ష్మీవ్రతాలు చేసుకునే మహిళలకు హైదరాబాద్‌కు చెందిన కంబాల శ్రీనివాస్‌రావు దంపతులు బంగారు వరలక్ష్మి పేరుతో లక్కీడిప్ ద్వారా 50 మందికి బంగారు రూపులు ఇవ్వనున్నట్టు ప్రకటించారు. దీంతో విశేష సంఖ్యలో మహిళలు వ్రతాలు చేసుకునేందుకు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గోకవరం: మండలంలోని వీరలంకపల్లి శివారులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైనట్టు గోకవరం హెడ్ కానిస్టేబుల్ భాస్కరరావు తెలిపారు. వివరాల్లోకి వెళితే...వీరలంకపల్లి గ్రామానికి చెందిన కర్రి సాంబమూర్తి తాపీ పనికి వెళ్లి మోటారు సైకిల్‌పై వస్తుండగా వీరలంకపల్లి శివారు బురద కాలువ వంతెన వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సాంబమూర్తిని స్థానికులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భాస్కరరావు తెలిపారు.

అనకాపల్లి ప్రభుత్వ ఖాజీగా షేక్ అబ్దుల్లా



జగ్గంపేట మసీద్‌లో షేక్ అబ్దుల్లాను సత్కరించిన ముస్లింలు

జగ్గంపేట: స్థానిక సన్నీ జామియా మసీద్‌లో ఇమామ్‌గా సేవలు అందిస్తున్న షేక్ అబ్దుల్లా అనకాపల్లి జిల్లా ప్రభుత్వ ఖాజీగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర మైనార్టీ మంత్రిత్వశాఖ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. జగ్గంపేట మసీద్‌లో శుక్రవారం ముస్లింలు షేక్ అబ్దుల్లాను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అబ్దుల్లా పదేళ్ల నుంచి జగ్గంపేట మసీదులో ఇమామ్‌గా సేవలు అందిస్తున్నారు. ముస్లిం పిల్లలకు అరబిక్, ఉర్దూ నేర్పిస్తున్నారు. కార్యక్రమంలో ముస్లింలు సయ్యద్ గఫూర్, షేక్ సలీమ్, మహ్మద్ ఖాజ, సయ్యద్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణకు చర్యలు



నులిపురుగుల నివారణపై వైద్యులతో సమీక్షిస్తున్న ఎంపీడీఓ రాజేశ్వరరావు

కిర్లంపూడి: విద్యార్థుల్లో నులిపురుగుల నివారణ కు విధిగా ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పీహెచ్‌సీల వైద్యులతో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 10న నేషనల్ డీవార్మింగ్ డే సందర్భంగా మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నులుపురుగుల నివారణ(ఆల్బెండజోల్) మాత్రలు పంపిణీ చేయాలన్నారు. ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది సమన్వయంతో పని చేసి విద్యార్థులందరికీ మాత్రలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల పీహెచ్‌సీల వైద్యులు రాంబాబు నాయక్, రవికుమార్, అభిషేక్ పాల్గొన్నారు.

భర్త కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు

జగ్గంపేట: మండలంలోని మల్లిసాల గ్రామానికి చెందిన ఐతు శివ కనిపించటం లేదని అతని భార్య హేమలత శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు జగ్గంపేట ఎస్సై విద్యాసాగర్ తెలిపారు. శివ, హేమలత ఈ మధ్యే ప్రేమ వివాహం చేసుకున్నారు. జగ్గంపేట నెహ్రూ కాలనీలో నివాసం ఉంటున్నారు. శివ స్థానిక కిరణ్ కంటి ఆసుపత్రిలో పనిచేస్తున్నాడని, గత నెల 27న ఇంటి మేడపై ఫోన్ మాట్లాడుతున్న శివ ఎంతకి కిందకు రాకపోవడంతో వెళ్లి చూడగా కనిపించలేదు. దీంతో అతని భార్య హేమలత కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి అన్ని చోట్ల వెతికినా ప్రయోజనం లేకపోయింది. శివ ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ కావడంతో శుక్రవారం అతని భార్య పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అన్నసమారాధన

కిర్లంపూడి: జగపతినగరంలోని అభయ దుర్గమ్మ, కిర్లంపూడి శివారు వేంచేసిన వనదుర్గమ్మ ఆలయాల వద్ద శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని అమ్మవారి అన్నప్రసాదం స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రమాదకరంగా మలుపు



తేటగుంట-హైవే మలుపులో నిలచిపోయిన వర్షపునీరు

తుని రూరల్: మండలం తేటగుంట ప్రధాన రహదారి నుంచి జాతీయ రహదారిని కలిసే మలుపు వద్ద వర్షపునీరు నిలిచిపోయి ప్రమాదకరంగా మారింది. ఇటీవల ఇక్కడ వై జంక్షన్‌లో సెంటర్ డివైడర్ నిర్మించడంతో పాటు రోడ్డును మళ్లిస్తూ మలుపు మార్గాన్ని ఏర్పాటు చేశారు. దీంతో సెంటర్ డివైడర్ ఇరుకుగా మారడంతో పాటు మలుపులో వర్షపునీరు నిలిచిపోతోంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీరును తప్పించుకుని వెళ్దామంటే ఇరుకు రోడ్డు మీదగా వెళ్లాల్సి వస్తోంది. మలుపు తిరిగి వెళ్లాలంటే నిల్వ నీటిలో ప్రయాణించాల్సి వస్తోందని ప్రయాణికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తేటగుంట, రౌతులపూడి మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు ఈ మార్గంలోనే హైవేకు వెళ్లాల్సి ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మలుపులో నీరు నిల్వ లేకుండా రోడ్డును పటిష్టంగా నిర్మించాలని కోరుతున్నారు.